కథ

# జీవితం నేర్పిన పాఠం

**లక్ష్మి మాధవ్**

ఎలా ఈ అవమానకరమైన పరిస్థితుల నుంచి బయట పడడం అన్నది సుమిత్రమ్మకి పెద్ద సమస్య అయింది. ఆమెకి ముఖం చెల్లక కొడుకు, కోడలి చూపులు కలిపి మాట్లాడడానికి కూడా ఇబ్బంది పడుతోంది, ఒక వారం నుంచి. హాస్పిటల్ ఆవరణ లోంచి బయలుదేరి తమ ఇంటి దారికి మళ్లుతున్న కారులో దిండుకి జార్లపడి అసహాయంగా కిటికీలోంచి బయటకు చూస్తోందామె.

పెద్ద పెద్ద కట్టడాల మధ్య నీలి ఆకాశంలో తెల్లని మబ్బులు తప్పు చేసిన మనుషుల్లా కంగారుగా వెనక్కి పరిగెడుతున్నాయి. నీలి ఆకాశం అందరి తప్పుఒప్పుల అచలసాక్షిగా ధీమాగా అన్నిటినీ గమనిస్తోంది.

'ఈ కారుకి యాక్సిడెంట్ అయి తను పోతే ఎంత బాగుంటుంది?' అనుకుందామె ఆ క్షణంలో.

కానీ మరుక్షణంలోనే దాన్ని డ్రైవ్ చేస్తున్న తన కొడుకుకి ఏదైనా జరిగితే, అని ఆలోచించింది. తను పోవటం మాట ఎలా వున్నా కొడుక్కి ఏ చిన్న కీడుని గానీ కష్టాన్ని గానీ కొని తెచ్చే ఊహని కూడా ఆమె భరించలేకపోయింది.

'ఛీ.. అలా జరగకూడదు భగవంతుడా! పిచ్చిపిచ్చిగా ఆలోచించాను దయచేసి అలా జరగనివ్వకు' అని వేడుకుంది మనసులోనే. భావోద్వేగంతో ఆమె పరిపరివిధాల ఆలోచిస్తోంది. మరోసారి దేవుడికి విన్నవించుకుంది.

'నా ఉద్రిక్త మనస్సు కోరుకుంటున్న కోరికలకు నువ్వు తథాస్తు అనవద్దు తండ్రీ.. నేనేం కోరుకోవాలో నాకే అర్థం కాని పరిస్థితి నేనే చేజేతులా రప్పించుకున్నాను' అనుకుంది కసిగా.

కార్లో ముందు సీటులో కోడలు సుమతి కూడా దైవాన్ని ప్రార్థిస్తోంది. దయనీయమైన అనారోగ్య పరిస్థితుల్లో చిక్కుకున్న అత్తగారిని, ఆమె చేసిన పాత అపరాధాల్ని తలుచుకుని చీదరించుకోకుండా సక్రమంగా సేవలు, సపర్యలు చేసి మళ్లీ మామూలు మనిషిగా తీర్చిదిద్దేంతటి శక్తిని, ఓర్పుని తనకి ప్రసాదించమని భగవంతుడిని అభ్యర్థించింది.

అవసరమైన వైద్యం అందించాలని చేస్తున్న ప్రయత్నాలు ఫలించి, ఆమె శరీరం వైద్యానికి తోడ్పడితే, ఎందరిలాగో ఆమె కూడా ఈ క్లిష్టమైన దేహస్థితి నుంచి బయటపడగలదని దృఢంగా నమ్ముతోందామె.

కిటికీ వైపు నుంచి తల మళ్లించి సుమిత్రమ్మ కోడలి ముఖకవళికలను గమనించటానికి ప్రయత్నిస్తోంది. తను కలలో కూడా ఊహించని ఈ కొత్త మలుపు తన జీవితాన్ని దారుణంగా మార్చింది.

తన ప్రమేయం లేకుండానే రోజులు గడిచిపోయాయి. హాస్పిటల్‌లో ఐ.సి.యు.లో మూడు రోజులు, వార్డులోకి షిఫ్ట్ చేశాక నాలుగు రోజులు చుట్టాలుపక్కాలు వచ్చి సానుభూతి వెలుబుచ్చటాలు, స్పెషలిస్టుల విజిట్స్, రకరకాల వైద్య పరీక్షలతోను గడిచాయి. వీటన్నిటితో ఆమె కోడలితో ఏకాంతంగా గడపవలసిన ఇబ్బంది నుంచి తప్పించుకోగలిగింది.

ట్రీట్‌మెంట్, హాస్పిటల్‌లోనే పూర్తయి తనకి తగ్గి మామూలు మనిషిగా ఇల్లు చేరతానని ఆశించిందావిడ. కానీ తననిలా అర్థాంతరంగా డిస్చార్జ్ చేస్తూ డాక్టర్ చెప్పిన మాటల తీరు చూస్తే తను జీవితాంతం ప్రతీ కదలికకు కొడుకు, కోడలి మీద ఆధారపడవలసిన అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ దుస్థితి ఆమెను మరింతగా కృంగదీసింది. పక్షవాతంతో ఆమె ఒక్క పక్క శరీరాంగాలన్నీ కుంటుపడ్డాయి. అదృష్టవశాత్తు మాట పడిపోలేదు. లేకపోతే ఆమె గతి ఇంకా దయనీయంగా మారుండేది. ఇప్పటికే ఆమెకి మాటిమాటికి దుఃఖం పెల్లుబుకుతోంది. మొన్నటికి మొన్న ఇంకొకసారి బెడ్‌పాన్ అవసరమైతేనే నర్సు ముఖంలో విసుగు స్పష్టంగా కనిపించింది. ఇక తాను అస్తమానం సాధించి వేధించిన తన కోడలు చీదరించుకోదూ మరి!

ఐనా ఇవన్నీ మొదటి నుంచీ ఊహించుకుంటే స్నేహంగా, ఆప్యాయంగా ప్రాణం పెడుతూ కోడలిని మంచి చేసుకునుండేది. కానీ తను ఎందుకింత మూర్ఖంగా వ్యవహరించేది? తనకి ఏ రోగం రాదనుకోవటం ఎంతటి మూర్ఖత్వం? ఇప్పుడు ఈ అసహాయ జీవన ఊబిలోంచి ఎలా బయట పడాలో పాలుపోలేదామెకు.

ఇల్లు వచ్చింది. తనని లోపలికి చేరవేసారు. తన పడక సరిచేసి మిగతా సరంజామా అంతా చుట్టూ అందుబాటులో ఉండేలా పెట్టాడు కొడుకు ప్రసాద్. సుమిత్రమ్మకి-బాబూరావ్‌కి ఆలస్యంగా పుట్టిన కొడుకు ప్రసాద్.

తనని గదిలోకి తీసుకొచ్చి పడుకోబెట్టగానే సామాన్లన్నీ తేరిపార చూసింది. తన వస్తువులన్నిటినీ చూసి ఎన్నో రోజులైనట్టనిపించిందామెకు. ఆసుపత్రిలో వుండడంవల్ల రోజూ తను వాడుకునే వస్తువుల మీద ఒక దొంతర దుమ్ము పేరుకుని నిస్తేజంగా కనపడుతున్నాయి. తను ఆరోగ్యంగా వుంటే ఇలా వుండనిచ్చేదా? అనుక్షణం పనిమనిషిని అదిలిస్తూ అన్నీ శుభ్రం చేయించేది. ఇప్పుడు తన శరీరాన్ని శుభ్రపరచటానికే ఇంకొకళ్ల దయ, సమయానుకూలాలు కోసం వేచి వుండాల్సిన గతి పట్టింది.

కోడలితో చనువుగా వుంటే ఆమె లోకువ కట్టేస్తుందేమోనని భయపడి ప్రతి నిమిషం గంభీరంగా పోజు పెట్టుకుని గడిపింది మూడు సంవత్సరాలు.

బాబూరావు పోయి సంవత్సరం దాటింది. తనలా అనారోగ్యంతో తీసుకోకుండా తోటపని చేస్తూ చటుక్కున గుండెపోటుతో మరణించాడు. ఆయన బ్రతికి వున్నన్నాళ్లు భార్యని కోడలితో స్నేహంగా వుండమని పదేపదే మందలించేవాడు. ఆయన సుమతితో ఎంతో స్నేహంగా వుండేవారు. తనకి ఆడపిల్లలు లేని లోటుని తీర్చుకున్నాడు. కోడలితో సరదాగా మాట్లాడుతూ చిన్న చిన్న వాదనలకి దిగుతూ పేకాట, చదరంగం లాంటి ఆటలు ఆడుతూ హుషారుగా గడిపేవాడాయన.

''ఇలా అలుసిస్తే రేపు నెత్తికెక్కుతుంది మీ ముద్దుల కోడలు'' అనేది ఉక్రోషం నిండిన గొంతుతో సుమిత్రమ్మ.

''అలాంటిదైతే అలుసు ఇవ్వకపోయినా ఎక్కేసి ఉండేది ఈపాటికి. మన సుమతి.. సు-మతి కలదే. ఐనా సుమిత్ర అన్న నీ పేరుకి తగ్గట్టు మైత్రితో ఆమె మనసు గెల్చుకో. స్నేహం ప్రేమ అన్న ప్రీమియంలతో మనం శక్తిలేని ముసలితనం నాటికి ఇన్సూర్ చేసుకోవాలి'' అని అనే ఆయన మాటల్లోని యదార్థం ఇప్పుడు అర్థం అయింది సుమిత్రమ్మకి.

బాబూరావు పోయినప్పుడు సుమిత్రమ్మ తన బేలతనం ప్రదర్శిస్తే సుమతి సమయం చూసి అధికారం చేతిలోకి తీసుకుంటుందన్న భయంతో బాధనీ గుండెల్లోనే దాచుకుంది. పైకి మాత్రం

దర్పం దర్జా ఒలికిస్తూ జాగ్రత్త పడింది. ప్రతీ పనిని తను చేసినట్టు చెప్పినట్టు చెయ్యాలని పట్టు పట్టేది. ఏదైనా చిన్నాచితుకు తేడా వచ్చినా సుమతి తల్లితండ్రుల పెంపకం, తాతల కాలం నుంచి వెనక్కి వెళ్లి దుయ్యబట్టేది. ఏ స్త్రీకైనా ఈ విషయం ఎంత బాధని కలిగిస్తుందో అర్థం చేసుకునేది కాదు. సుమతిని ఈ విషయం సహించలేనంతగా బాధపెట్టేది.

బాబూరావ్ మరణంతో సుమతి చాలా కోల్పోయినట్టు ఫీలైంది. సుమిత్రమ్మ, భర్త పోయిన తర్వాత మారుతుందని అంచనా వేసిన సుమతికి అత్తగారు చీటికీ మాటికీ గొడవలు పెంచటం ఆశ్చర్యాన్ని కలగజేసింది. ప్రతిదానికీ కయ్యానికి కాలుదువ్వడం సుమిత్రమ్మ దినచర్య అయిపోయింది.

అందరికీ స్నేహమాధుర్యాన్ని పంచే అత్తగారు తమ ఇంటి సభ్యురాలైన తనని ఎందుకు కించపరుస్తోందో పాలుపోయేది కాదు సుమతికి.

సుమిత్రమ్మ జరిగిన వాటికి బాధపడుతూ జరగబోయే వాటిని ఊహించి భయపడుతూ గడపడం వల్ల ఆమె కళ్ల అశ్రువులు కురిపిస్తూ తలగడ తడుపుతున్నాయి. ఆమె వాటిని స్వాధీనంలో వున్న చేతితో తుడుచుకుంటోంది.

సుమతి ఇంటికీ ఆసుపత్రికీ తిరగటం వల్ల అత్తగారికి సపర్యలు చేయటంతోను, పనితో సతమతమవటంతో పడక మీద మేను వాల్చగానే నిద్ర అన్న సుఖమయ మాయాలోకం తలుపులు తెరిచి అందులో స్వేచ్ఛగా విహరిస్తోంది. సుమిత్రమ్మ తన రుద్ధ కంఠం కోడలికి మెలకువ రప్పిస్తుందేమోనని బిడియపడుతూ పెదవుల మధ్యనే తన మదిలోని భావాగ్ని గుండాన్ని అదిమి పెట్టింది.

మళ్లీ తెల్లవారగట్ల తను ఎప్పుడూ నిద్ర మేలుకునే సమయానికే మెలకువ వచ్చినప్పటినుంచీ మళ్లీ ఆలోచనల పెను తుపానులో తీవ్రమైన అఘాతానికి గురైన ఆమె మానసిక నౌక భావావేశాన్ని తట్టుకోలేని దుర్బల క్షణంలో మరణాన్ని ఆశ్రయించింది.

'నేను ప్రాణం తీసుకోవాలి అని అనుకోగానే మరణం వస్తుందా? అంతటి మహనీయురాలినైతే నేను సుమతిని ఇన్ని కష్టాలు పెడతానా?' దుఃఖంలోనే నవ్వుకుంది సుమిత్రమ్మ.

ఆమె ఆత్మహత్యే శరణ్యం అనుకుని దాన్ని ఆచరణలో ఎలా పెట్టాలి? అని శతవిధాలా ఆలోచించింది.

ప్రొద్దుటే ఇల్లు తుడవటానికి వచ్చిన రత్తాలుతో అంది-

''రాత్రంతా దోమలు పీల్చుకుతిన్నాయి, కాస్తంత స్టోర్‌రూంలో వున్న హిట్ స్ప్రే తెచ్చిపెట్టవే''

రత్తాలు దోమల మందు తెచ్చి స్ప్రే చేసి మళ్లీ స్టోర్ రూంలో పెట్టబోతే వద్దని వారించింది.

''ఇక్కడే వుండనీవే! మళ్లీ రాత్రి అవగానే పీడిస్తాయి వెధవ దోమలు'' అంది.

రత్తాలు అక్కడి నుంచి వెళ్లిన వెంటనే కళ్లజోడు పెట్టుకుని మరీ ఆ డబ్బా మీదున్న సూచనలన్నీ జాగ్రత్తగా చదివింది.

స్ప్రే చేసేది అవ్వటంవల్ల దాన్ని ఎంత సేవించాలో అర్థం కాలేదావిడకి.





'సరిపడ డోస్ తీసుకోకపోవటం వల్ల ఉపాయం బెడిసి కొట్టి కథ మొదటికి వచ్చే అవకాశం ఉంది' అనుకుని నిట్టూర్చి.... 'పూర్తిగా చావక ఇంకా దారుణమైన త్రిశంకులోకి వెళ్లి తన వాళ్లకి తనకీ కూడా కష్టాలు కొని తెచ్చుకున్నట్లవుతుంది' అనుకుంది ఆలోచిస్తూ.

'లేదు.. లేదు అలా జరగటానికి వీలులేదు. తను సూచనలన్నీ క్షుణ్ణంగా చదివి.. దాన్ని ఎలా వాడితే ప్రాణం పూర్తిగా పోతుందో సరిగా స్టడీ చేసి మరీ సేవించాలి' మళ్ళీ మనసు ఊగిసలాడింది.

'రాణిలా బ్రతికిన ఈ సుమిత్రమ్మ ఇలా చనిపోతే ఎలా? రాణిలా బ్రతికి రాణిలాగే పోవాలి తను. కానీ ఇప్పుడెలా? విధికే తన జీవితాన్ని వదిలేసి, దాని చేతుల్లో కీలుబొమ్మలా అన్నీ తట్టుకుని నిలబడాలా? ఒకళ్లని అనటమే కాని వాళ్ళచేత పడటం చేత కాదీ సుమిత్రమ్మకి' అనుకుంది ధీమాగా.

సపర్యలు చేయించుకుంటూ, మందులు మాకులు, ఫిజియోథెరపీలు, మర్దనాలు... అన్నీ మంచం మీదే జరుగుతుంటే అందరూ అసహ్యించుకుంటూ, చీదరించుకుంటూ బయటకు మాత్రం సానుభూతి వెలిబుచ్చుతూ ''ఎప్పుడు పోతుందా, ఈవిడ?'' అని చాటుగా పెడుతున్న శాపనార్థాలు వింటూ బ్రతికే బ్రతుకు ఒక బ్రతుకేనా?

'అలా జరగటానికి వీల్లేదు, వంటల్లో ఉప్పు, కారం తగినంత వేసి అద్భుతంగా వండిన తన చేతులు, నేడు ప్రాణం పోవటానికి తగినంత విషం అంచనా తెలియక విలవిల్లాడకూడదు. ప్రాణహాని జరిగే లక్షణాలు కనిపించేవరకు విడవకుండా ప్రయత్నిస్తే సరి. కానీ తను ఇంత పిరికిదా?' ఇలా అనుకుంటూ మళ్ళీ మళ్ళీ చదవసాగింది సూచనలను.

అత్తగారికి టిఫిన్ ఇవ్వటానికి వచ్చిన సుమతి ''ఏమిటత్తయ్యా... చదువుతున్నారు? కాలక్షేపం కావటం లేదా? మీకు అసలు పని ధ్యాస తప్ప ఊరికే సమయం గడిపే అలవాటే లేదాయె?'' అంది.

ఉలిక్కిపడింది సుమిత్రమ్మ.

''మీరు కాలక్షేపానికి చదవాలనుకుంటే ఈ పుస్తకం చదవండి. చాలా బాగుంది'' అంటూ అందించింది.

నిర్లక్ష్యంగానే అందుకుంది. పక్కకు పెడదామంటే సుమతి అక్కడే అన్నీ క్లీన్ చేస్తూ తిరుగుతోంది. ఇక తప్పదన్నట్లు అయిష్టంగానే మొదలుపెట్టింది. కొంతసేపట్లో తన పరిస్థితులకు అద్దం పట్టేలా రచించిన మంచి పుస్తకం కావటంతో నెమ్మదిగా దాంట్లో లీనమై చదవసాగింది. తనింతకాలం పని, పని అంటూ కొట్టుకునేదే కాని, ఏనాడు భావుకత, సంగీతం, సాహిత్యం, ఆధ్యాత్మిక చింతనలను దరి చేరనివ్వలేదు. కోడలు పుస్తకాలు చదువుతున్నా కూడా సాధించేది.

''పుస్తకాలు చదువుతూ కూర్చుంటే నోట్లోకి ముద్దలు వస్తాయా..? వచ్చి వంట పని చెయ్యి'' అంటూ అదిలించేది. లేనిపోని పన్లు వెతికేది. ఎప్పుడైనా చదువుతూ ఆమె కంటపడితే ''రాత్రీ పగలు ముద్దలు ఉడికించుకోవటమేనా? మనస్సుకి, మెదడుకి మేత అవసరంలేదా? బ్రతకటానికి ముద్దగాని, ముద్దకోసమే బ్రతుకుకాదు కదా! జంతువులకి మనకీ తేడా ఉందికదా'' అన్న మాట నోటిదాకా వచ్చినా దిగమింగి, గబ గబా పని ముగించి గదిలోకి వెళ్ళి చదువుకునేది సుమతి.

మరీ ప్రాణాలు తీసేంతటి క్రూరత్వం గలిగిన అత్తమామలు కొందరు ఉన్నప్పటికీ, అధిక శాతం అత్తగార్లు తమ అధికారం చెల్లించుకోవాలన్న పంతంతోనే ఆరళ్లు పెట్టటానికి సిద్ధపడతారన్న కిటుకు తెలిసిన సుమతి, ఇలాంటి సాధింపులని పెద్దగా పట్టించుకోకుండా శాంతిని తమ ఇంట్లో నెలకొనేలా చేసేది. కాని తను అంటున్న మాటలు ఆమెని ఎంతగా బాధించేవో ఊహించిన సుమిత్రమ్మ, ఇప్పుడు దానికామె ప్రతీకారం తీర్చుకుంటే...? అన్న భయంతో బాధపడ్తోంది.

కొంతసేపు మొక్కుబడిగా చదవటానికి మొదలుపెట్టిన ఆ మంచి పుస్తకం ఆమెని పుస్తక పఠనంలో ఉండే రుచిని ఆస్వాదించేలా చేసి, నిమగ్నమైయ్యేలా చేసింది. తను చదువురానిది కాకపోయినా ఎందుకు ఇన్నాళ్లు చదివేది కాదో అర్థంకాక కారణాల కోసం వెతుక్కుంది మనస్సులోనే.

ఆశ్చర్యం! తాత్కాలికంగా ఆమె ఆత్మహత్య విషయం మరచిపోయింది. ఇలా గంటన్నర గడిచింది. ఈలోగా డాక్టర్ చెప్పిన పథ్యం ప్రకారం వంట చేసింది సుమతి. అన్ని అధరువులూ చెరో గిన్నెలోనూ కలిపి, మూతలు పెట్టి అన్ని గిన్నెలు ఒక కంచంలో పెట్టుకుని తెచ్చింది.


తినిపించడానికి వీలుగా చెమ్చాతో సహా తెచ్చిన సుమతి కంచాన్ని స్టూలు మీద పెట్టింది. ఒక కటోరీలో కాస్తంత పాయసం కూడా ఉండటం గమనించి సుమిత్రమ్మ గారు, ఇదేమిటన్నట్లు చూసింది.

''అత్తయ్యా.. ఈ రోజు మీ పుట్టినరోజు కదా. అయినా హాస్పిటల్ నుంచి మీరు ఇంటికి వచ్చిన రోజు దేవుడికి తీపి చేసి నైవేద్యం పెట్టాలని మొక్కుకున్నాను'' అంది తల వంచుకుని.

''చావు ఎప్పుడు వస్తుందా? అని వేచి వున్న నాకు, నా పుట్టినరోజు విషయం కూడా జ్ఞాపకం లేదే తల్లీ... అయినా నాకు

## మాధురికి నిరాశ?

**'దేవదాసు' చిత్రంలో నటించిన తర్వాత ఐదేళ్ల గ్యాప్ ఇచ్చి మళ్లీ 'ఆజా నచ్‌లే'తో తెరపైకి వస్తున్న మాధురీ దీక్షిత్ తన రీ ఎంట్రీ చిత్రం రూపొందిన తీరు చూసి నిరాశకు గురైందిట. 'లగాన్' లాంటి సినిమాలకు పనిచేసిన కెమెరామన్ అనిల్ మెహతా తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ముఖ్యమైన సీన్ ఒకటి తీసేయడంపై మాధురికి కోపం వచ్చి సినిమా ప్రమోషన్‌లో పాల్గొనడానికి సుముఖంగా లేనని చెప్పిందిట. టోటల్‌గా ఈ సినిమా మాధురికి అంత తృప్తిని ఇవ్వలేదని భావిస్తున్నట్టు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. అయినా ఒక వయసు దాటాక మళ్లీ హీరోయిన్లుగానే రీఎంట్రీ అవడం అంటే అంత తేలికైన సంగతేం కాదు కదా!**



ఎందుకమ్మా... ఈ స్వీట్లు పుట్టినరోజు వేడుకలు'' అంది నీళ్ళు నిండిన కళ్లతో ఆవిడ.

''అయినా నేను నిన్ను వేధించిన తీరుకి, నువ్వు నాకు శాపనార్థాలు పెట్టాలి'' అంది అప్రయత్నంగా సుమిత్రమ్మ.

సంకట సమయంలో ఆప్యాయత, ఓదార్పు చవి చూపించటంవల్ల ఆమె మనస్సు లోపల్నుంచి స్పందన కలిగి, ఆ స్పందనా తరంగాల ప్రకంపనల వల్ల నాలుకా, మెదడు కలిసి అప్రయత్నంగా ఆమె ప్రమేయం లేకుండా పలికించిన పలుకులవి.

అది వింటూనే సుమతి ''అలా అనకండి అత్తయ్యా. మీరు నాతో ఎంత కటువుగా వ్యవహరించినా, నన్ను పరాయి దానిలా చూసినా... మన మధ్యవున్న బంధం తెగుతుందా? మనం ఒక ఇంట్లో వాళ్లం కదా.. పెద్దవారైన మీరు స్వతంత్రంవల్ల నన్ను అదలించటం సహజమే. మీ మాటల వల్ల నా మనస్సుకి నొప్పి కల్గిన విషయం వాస్తవమే. కాని నేను బాధపడ్డానని మళ్ళీ నేను మీ మీద ప్రతీకారం తీర్చుకోవటానికి కఠినంగా వ్యవహరించటం కేవలం తాత్కాలిక ఉపశమనం కల్గిస్తుంది. కొంత కాలానికి మీకు ఇప్పుడు కల్గినట్లుగా నాకూ పశ్చాత్తాపం కల్గవచ్చు.. కాని మళ్ళీ ఇలాంటి పరిస్థితులను నా చేజేతులా నేనే సృష్టించుకోవటం నాకు సరి అనిపించలేదు'' చెప్పింది స్పష్టంగా.

''నేను మీరు పడ్తున్న అంతర్మథనాన్ని నాలుగు రోజులుగా గమనిస్తూనే ఉన్నాను, కాని మీ తప్పుని మీరు పూర్తిగా విశ్లేషించుకోవటానికి కొంత సమయాన్నిచ్చి తర్వాత నేను కల్పించుకుందామని ఊరుకున్నాను'' అన్నది సుమతి మెల్లగా.

ఆ మాటలు విని అవాక్కైయింది సుమిత్రమ్మ. మనస్సులోనే కోడలి విశ్లేషణ, విచక్షణ గుణాలకు జోహార్లు అర్పించింది. దానితో చావుని ఆశ్రయించాలన్న తలంపే ఇక రాలేదు.


మనస్ఫూర్తిగా దేవుడికి ఇంత మంచి కోడలిని ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంది. సుమతి తెచ్చిన భోజనాన్ని తింది.

ఆ రోజు నుంచి సుమతికి పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చింది. ఆమె ఏది అడిగినా ''నీ ఇష్టం తల్లీ... నువ్వు ఏది చేసినా ఆలోచించి చేస్తావన్న నమ్మకం నాకుంది'' అనేది.

లౌకికమైన విషయాల మీద మక్కువ తగ్గించుకుని దైవధ్యానం, వైరాగ్య చింతన, ఆధ్యాత్మిక పుస్తకాలు, టీవిలో ఆలోచింపచేసే కార్యక్రమాలు లాంటివి శ్రద్ధగా చూసేది. ఇలా మానసికంగా ఆరోగ్యకరమైన ఆలోచనలతోపాటు మందుల, పథ్యం, ఫిజియోథెరపీ, ఉద్రేకరహితమైన శాంతస్వభావం, సంతృప్తి, సంతోషాలని జీవితంలోకి ఆహ్వానం పలకటంవల్ల చచ్చుపడిన శరీరంగాలు నెమ్మదిగా స్వాధీనంలోకి రాసాగాయి. తన పన్లు తనే నెమ్మదిగా చేసుకోవాటానికి ప్రయత్నించేది. వాకర్ సహాయంతో ఇంట్లో గదినుంచి గదిలోకి నెమ్మదిగా నడిచేది.

ఇప్పుడు సుమతికి ఇంటి బాధ్యతలు పెరగటం వల్ల పుస్తకాలకి ఎక్కువ సమయం కుదరటం లేదు. అందుకని సుమిత్రమ్మగారే కొన్ని బిగ్గరగా చదివి వినిపించేది. వాటిలోని విషయాలను ఇద్దరూ కలిసి చర్చించుకునేవారు. ఇవన్నీ చూసి ప్రసాద్ ముచ్చటపడేవాడు. ఎప్పుడూ సంసారాల్లో జరిగే అత్తాకోడళ్ళ గొడవలతో ఎటూ చెప్పలేక బాధింపబడేది. కొడుకవ్వటంవల్ల, అత్తా కోడలు సయోధ్యగా ఉన్నా ఎక్కువ సంతోషపడేవాడు అతనే అవుతాడు. సుమతి ఓర్పుతో తల్లిలో తెచ్చిన మార్పుకి అతను చాలా ఆశ్చర్యపడేవాడు. ఇలా ఒక సంవత్సరంలో ఇంచుమించుగా సుమిత్రమ్మ మామూలు మనిషైంది.

ఆ రోజు బిగ్గరగా ఏదో హాస్య కథ చదివి వినిపిస్తోంది సుమిత్రమ్మ సుమతి పని చేసుకుంటూ వింటోంది.



సమిత్రమ్మకి బాగా గొంతు తడి ఆరిపోతున్నట్లు అనిపించింది. అయినా పక్కనున్న చెంబులో నీళ్ళు త్రాగి మళ్ళీ చదవనారంభించింది. పలమారినట్లై, ఎక్కిళ్ళు ప్రారంభమయ్యాయి. ఎంత ఆపుకుందామన్నా ఆగలేదు. తనలో ఏదో మార్పు స్పష్టంగా తెలుస్తోందామెకు. గుండెని పిండేస్తున్నట్లుగా ఉంది. తనకి ఏదో అవ్వబోతోంది...

కాని తనకిప్పుడు, ఏం జరిగినా బెంగ లేదింక.. ఇదివరలోలా కాక తనకీ కోడలికీ ఉన్న అరమరికలు అన్నీ సమసిపోయాయిప్పుడు. తనకంటూ ఏ బాధ్యతలు లేవు. ఇదివరకున్న అపరాధ భావన కూడా మాయమై, తన మనస్సులోని భావాలన్నింటినీ సుమతితో పంచేసుకుంది. తన స్థానంలో తన కోడలు అన్ని బాధ్యతల్నీ నెరవేరుస్తుందిక. కొడుకుని ప్రాణప్రదంగా ప్రేమ వాత్సల్యాలు పంచి ఇస్తుందన్న నమ్మకం, భరోసా తనకున్నాయి. దరిదాపుగా ఒక సంవత్సర కాలం తృప్తిగా జీవనం సాగించింది వాళ్ళతో. తనని బిడ్డగా చూసుకున్న ఆ చిట్టితల్లికీ, ఇక తన స్వంత పిల్లల్ని కని పెంచే భారం కూడా పడిందని క్రితం నెలే తెలిసింది. ఇక తను ఉంటే మనవల్ని చూస్తుంది, లేకపోతే పై లోకాలనుంచే వాళ్ళందరినీ ఆశీర్వదిస్తుంది అనుకుంటూ పక్కకు ఒరిగిందామె.

అపస్మారక దశలోకి జారుకుంటూ, తెలీని లోకపు అంచుల్లోకి అడుగిడుతూ ఆమె మస్తిష్కంలో మనో తరంగాలు తృప్తిగా తీరాన్ని చేరి విశ్రమిస్తున్నాయి.

చదవటం ఆగిపోయిన విషయం గమనించి, సుమతి కంగారుగా పరిగెట్టుకువచ్చి ఆమెని చూసి భర్తకీ, అంబులెన్స్‌కి ఫోన్ చేస్తోంది.

☆

## మరీ బడాయి కదా!

**ఇప్పుడిప్పుడే బిజీ అవుతున్న హంసిక ఈమధ్య లండన్ వెళ్లిందిట. షాపింగ్ చేస్తూ తీరా బిల్లు కట్టే సమయానికి హాండ్ బాగ్‌లో చూసుకుంటే డబ్బులు మర్చిపోయిందిట. కంగారుపడిపోతున్న ఆమెకి ధైర్యం చెబుతూ పక్కనే వున్న ఓ యువదంపతులు వెంటనే ఆమెకి డబ్బిచ్చి షాప్‌నుంచి బయటపడేలా చేసారట. వాళ్లని హంసిక తన హోటల్ రూంకి తీసుకొచ్చి బాగ్‌లోంచి డబ్బు తీసిస్తుంటే 'అబ్బే డబ్బు వద్దండి. ఆ వస్తువులు మీకు గిఫ్టుగా ఇచ్చామనుకోండి. ఎందుకంటే మేం ఎప్పటినుంచో మీ ఫాన్స్‌మి' అంటూ చెప్పేరట. అవునూ! హంసిక ఎన్ని సినిమాలు చేసిందనీ విదేశాల్లో సైతం 'ఫాన్లు' వుండడానికి అని మనం ముక్కున వేలేసుకోవలసిందే!**